భంభం బాబా ఆరాధన మహోత్సవాలు



పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



ఆరాధన మహోత్సవాలకు హాజరైన భంభం బాబా భక్తులు



కబీర్ కిరణ్‌స్వామిని దర్శించుకున్న ఎంపీ రంగయ్య

- సామూహిక వివాహాలు, రక్తదాన శిబిరం, వైద్య శిబిరాలు

ధర్మవరం అర్బన్: శ్రీ సద్గురు భం షేక్ అబ్దుల్ స్వామి 55వ, శ్రీ సద్గురు భం అన్వరానంద బాబా 21వ ఆరాధన మహోత్సవాలు మైసూరు సర్వధర్మ నిలయం ట్రస్ట్ పీఠాధిపతి గురుదేవులు భం కబీర్ కిరణ్‌స్వామి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పీఠాధిపతి భం కబీర్ కిరణ్ స్వామిని పూర్ణకుంభాలతో భక్తులు, కన్యలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. పాండురంగస్వామి ఆలయం నుంచి మహోత్సవాల వేదిక అయిన సీఎస్‌బీ గార్డెన్స్ వరకు సాగింది. అనంతరం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత సామూహిక వివాహాలు, రక్తదాన శిబిరం, కేశఖండనాలు, నామకరణాలు తదితర కార్యక్రమాలు జరిగాయి. కబీర్ కిరణ్ స్వామీజీ భక్తులనుద్దేశించి ఉపన్యసించారు. అనంతరం పరమ పవిత్రమైన గురుదేవులకు గురుపూజ నిర్వహించారు. వేలాది మందికి ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ధర్మవరం భంభం బాబా ట్రస్ట్ నిర్వాహకులు కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారు. అంతకు ముందు అనంతపురం ఎంపీ పీడీ రంగయ్య.. కబీర్‌కిరణ్‌స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో మహిళ మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్

ఎన్పీకుంట: కమ్మగుట్టపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు మాధవరెడ్డి తల్లి ఆసం లీలావతి (55) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ వేరువేరుగా మృతదేహన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రంగారెడ్డి, సీనియర్ నాయకులు బాలకృష్ణనాయుడు, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, ఎంపీపీ రాము, నాయకులు తిరుమలనాయుడు, ఈశ్వర్‌నాయక్, కృష్టారెడ్డి, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని బడన్నపల్లి, గొళ్లపల్లి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

వారపు సంత గేటు వేలం వాయిదా

తలుపుల : తలుపుల మేజర్ పంచాయతీలో వారపు సంత గేటు (సుంకం) వసూల కోసం ఈ నెల 27న నిర్వహించనున్న వేలం పాట వాయిదా వేసినట్లు ఈఓ అబ్దుల్ మునాఫ్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరిగి వేలం ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న కాటికోటేశ్వరస్వామి

తాడిమర్రి: మండలంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, వివిధ రకాల పుష్పాలు, పుష్పమాలలతో అలంకరించారు. భక్తులు గదాగుండం (కోనేరు)లో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తి శ్రద్ధలతో సత్యసాయి పల్లకీ సేవ



పల్లకీలో సత్యసాయి ఊరేగింపు

పుట్టపర్తి రూరల్: భక్తిశ్రద్ధలతో సత్యసాయి పల్లకీ సేవ నిర్వహించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుమలపల్లి చెరువు వద్ద సత్యసాయి బాబా ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కదిరి పున్నమిని పురస్కరించుకుని బాబా చిత్రపటాన్ని పల్లకీపై కొలువుదీర్చారు. సత్యసాయి భక్తి గీతాలు ఆలపిస్తూ ఎనుములపల్లి, బస్టాండ్ మీదుగా గణేష్ సర్కిల్ వరకు పల్లకీ సేవ నిర్వహించారు.

రమణ మహర్షి ఆశ్రమంలో పౌర్ణమి వేడుకలు



ఆరాధన పాటలు పాడుతున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపాన రమణ మహర్షి ఆశ్రమంలో సోమవారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అరుణాచల శివ నామస్మరణతో భక్తులు రమణ మహర్షికి పూజలు చేశారు. అనంతరం మహా పరిపూర్ణ శాంతి యాగం చేశారు. మహిళలు భక్తి పాటలు పాడారు. ఆశ్రమం నిర్వాహకులు చిప్పల వెంకప్ప భక్తులకు అన్నదానం చేశారు.

అనుమతి లేకుండా నగదు తరలిస్తే సీజ్



యర్రాయపల్లి క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

బత్తలపల్లి: ఇతర ప్రాంతాలకు నగదు తరలింపు విషయంలో అనుమతి తప్పనిసరి అని ఎస్‌ఐ శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం ఆయన యర్రాయపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నగదు విషయంలో పరిమితులు విధించారని అన్నారు. ఎవ్వరైనా రూ.50 వేల వరకు మాత్రమే తీసుకువెళ్లవచ్చని, అంతకుమించి తీసుకెళితే అనుమతి పొందాలని, లేదంటే ఆ సొమ్మును సీజ్ చేయకతప్పదని హెచ్చరించారు. వాహనాల్లో డబ్బులు, మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. డబ్బు, మద్యం తీసుకువెళ్లేవారు రసీదు కలిగి, అధికారుల నుంచి అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికలు ముగిసే వరకూ నిత్యం ఈ తనిఖీలు చేస్తూ ఉంటామన్నారు.

ఎన్నికల సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌లు తెలిపారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల విధుల్లో మినహాయింపులో భాగంగా వికలాంగ ఉపాధ్యాయులు, దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారికి మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. గర్భిణులు, చిన్నపిల్లల తల్లులకు కూడా ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం రంజాన్ మాసంలో ముస్లిం ఉపాధ్యాయులకు, పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ సమయంలో వారికి అవసరమైన సౌకర్యాలు, మినహాయింపులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శులు తాహీర్‌వలి, శివశంకర్, లక్ష్మీనారాయణ, నరేష్, ఆడిట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే దుద్దుకుంట పరామర్శ



మంజునాథ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రి నుంచి ఇంటికొచ్చి విశ్రాంతి తీసుకుంటున్న ఎ.కొత్తపల్లి టెక్నికల్ అసిస్టెంట్ మంజునాథ్‌ను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అనంతరం చినగానిపల్లికి వెళ్లి పలువురు నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భర్త శివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, సర్పంచ్ షబ్బీర్, ఎంపీటీసీ పెద్దప్పయ్య, నాయకులు హరినాథరెడ్డి, నరసింహారెడ్డి, దొడ్డెప్ప, తదితర సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రామగిరి: మండలంలోని ఎగువపల్లి కర్ణాటక సరిహద్దులోని చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సాయంత్రం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. కనగానపల్లి మండలం మద్దలచెరువు గ్రామానికి చెందిన ముత్యాలన్న ద్విచక్ర వాహనంలో 200 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

కొత్తచెరువు: మండల కేంద్రం కొత్తచెరువులోని ప్రధాన రహదారులపై సోమవారం పోలీసులు, ప్రత్యేక కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ రాజారమేష్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు రెచ్చగొట్టి ఘర్షణలకు పాల్పడితే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బుక్కపట్నం ఎస్‌ఐ సురేష్ తదితతరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి పలువురు ముస్లింల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లింలతో మక్బూల్

తనకల్లు: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పలువురు ముస్లిం యువకులు కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం వైఎస్ జగన్ పాలన నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు షేక్ మక్తుమ్, షేక్ ఘనీ, మాజిద్ ముక్తావలి, హుస్సేన్, బాబ్‌జాన్, ఇమామ్‌షా, అమీర్, చాంద్‌బాషా, బాషా, హుసరుద్దీన్, ఖాసీం, షేక్ యర్రబాషా, హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తబ్రేజ్, నాయకులు చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల వేల్పు.. ఖాద్రీశుడి ఊరేగింపు



ఆలయంలో పోటెత్తిన భక్త జనం



శేషవాహనం ఊరేగింపు ముందు తమిళనాడు వాయిద్యకారులు

తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామికి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరిగితే ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు పక్షం (15) రోజుల పాటు జరుగుతాయి. ఈసారి పాల్గుణ కృష్ణ దశమి నాడు(19న) అంకురార్పణతో ప్రారంభమై పాల్గుణ కృష్ణ అష్టమి(ఏప్రిల్ 2) నాడు పుష్పయాగోత్సవంతో ముగుస్తాయి. సాక్షాత్తు బ్రహ్మదేవుడే దగ్గరుండి వీటిని నిర్వహించడం వలన బ్రహ్మోత్సవాలు అంటారు. సోమవారం శేషవాహనంపై శ్రీవారు తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదానంతో పాటు భక్తుల కాలక్షేపం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. – కదిరి

సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర గస్తీ

నల్లచెరువు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఎస్‌ఐ లింగన్న తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని జాతీయరహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. సమస్యాత్మక ప్రదేశాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ఎన్నికల దృష్ట్యా పెద్దయల్లంపల్లిలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు.

వైభవంగా కదిరి పున్నమి వేడుకలు



నరసింహస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పుట్టపర్తి రూరల్: మండలంలోని ఎనుములపల్లి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కదిరి పున్నమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సోమవారం గ్రామంలోని భక్తులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నరసింహస్వామి కాపులకు అతి పవిత్రమైనదిగా కదిరి పున్నమి. నరసింహస్వామి లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి కాయ, కర్పూరం సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు నాగరాజరావు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు.

- అలాగే హనుమాన్ దేవాలయం, హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరనారాయణస్వామికి మారు పూజ



కుంకాలు ఆడుకుంటున్న భక్తులు

ముదిగుబ్బ: కమ్మవారిపల్లిలో వెలసిన వీరనారాయణస్వామికి సోమవారం మారు పూజ చేశారు. శివరాత్రి పర్వదినం మరుసటి రోజున వీరనారాయణస్వామి పరుష తరువాత 15 రోజులకు మారుపూజ చేయడం ఆనవాయితీగా వస్తోందని పూజారి గంగమోహన్ తెలిపారు. మారు పూజ సందర్భంగా భక్తులు కుంకుమలు చల్లుకొని సంబరాలు చేసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి వీరనారాయణస్వామిని దర్శించుకుని తరించారు.

ఓబులేసు స్వామికి పూజలు

తాడిమర్రి: గరుడ పౌర్ణమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఓబులేసు స్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పూజారి స్వామి విగ్రహాలను పలు రకాల పుష్పాలు, పుష్ప మాలలు, ఆకుపూజతో అందంగా అలంకరించారు. అనంతరం భక్తులు స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

అంబరమంటిన హోలీ సంబరం



బత్తలపల్లిలో రంగులు చల్లుకుంటూ చిన్నారులు కేరింతలు

తాడిమర్రి/ బత్తలపల్లి/ అమడగూరు: ఆనందాల హోలీ సంబరం పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అంతటా అంబరమంటింది. రంగులు, రంగునీళ్లను ఒకరిమీద ఒకరు రంగులు చల్లుకుని అనురాగ, ఆప్యాయతలు చూపారు. సంతోషంతో చిందులు వేశారు. రంగునీళ్లలో తడిసి ముద్దయ్యారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందాలు, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

- తాడిమర్రి, పిన్నదరి, చిల్లకొండయ్యపల్లి, కునుకుంట్ల, దాడితోట, నిడిగల్లు, ఎం అగ్రహారం, చిల్లవారిపల్లి, ఆత్మకూరు తదితర గ్రామాల్లో పిల్లలు, పెద్దలు వీధుల్లోకి వచ్చి రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.
- మండల కేంద్రం బత్తలపల్లితో పాటు పలు గ్రామాలలో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పత్యాపురం, సంగాల తండాలలో గిరిజనులు హోలీని సంతోషంగా జరుపుకొన్నారు.
- అమడగూరు మండలంలోని మలకవారిపల్లి ఎగువ, దిగువ తండాలు, గోపాల్‌నాయక్ తండా, ఏటిగడ్డ తండా వాసులు హోలీని ఘనంగా జరుపుకొన్నారు. తండాల్లో బంధుమిత్రులతో విందుభోజనాలతో పండుగ వాతావరణం నెలకొంది.

ఉత్సాహంగా హోలీ

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం హోలీ పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. కుర్లపల్లి తాండా, ముత్తువకుంట, మద్దెలచెరువు, కేకే, పీకే తాండాల్లో గిరిజనులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిల్లలు, యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

CHANGE OF NAME

Smt CHILAKAM SAVITHRI Age 40 years, D/o Chilakam Obula Reddy, Hindu, House wife date of birth: 10-6-1984, R/o Amidalakunta Village and Post, Chennekothapalli Mandal, Ananthapuramu Dist, Andhra Pradesh do hereby declare that after my marriage with one Vemannagari Srinath Reddy (Late) my full name has become **VEMANNAGARI SARITHA** (New Name) hence after all my documents and correspondence continue with my New Name **VEMANNAGARI SARITHA** So, Both the names and surname **VEMANNAGARI SARITHA** W/o Vemannagari Srinath Reddy (Late), Poletipalli Village and post Chennekothapalli Mandal are one and the same person i.e, refers to my name only.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ ట్యాక్సీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సూర్యశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఖాదర్‌బాషా, రాజేంద్ర, మహేంద్ర, ఉమ్మర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మక్బూల్ అహ్మద్

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్

గాండ్లపెంట: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా సైనికుల్లా పనిచేయాలని కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు. సోమవారం గాండ్లపెంటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ విజయానికి అనుసరించాల్సిన విధి విధానాలు, సూచనలు తెలియజేశారు. అన్ని వర్గాలను కలుపుకుపోయే విధంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలు ఇచ్చే మోసపూరిత హామీలను ప్రజలు నమ్మకుండా అప్రమత్తం చేయాలన్నారు. వైఎస్ జగన్ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ఎన్నో పేద కుటుంబాలు బాగుపడ్డాయని గుర్తు చేశారు. అలాంటి సంక్షేమ, జనరంజక పాలన తిరిగి కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తేవాలన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్ మక్బూల్ అహ్మద్

నేడు వేపమానిపేట పంచాయతీలో మక్బూల్ ప్రచారం

తలుపుల : వేపమానిపేట పంచాయతీలోని వేపమానిపేట, చదలవాండ్లపల్లి, ఊసయ్యగారిపల్లి, శింగనపల్లి, పెద్దపల్లి గ్రామాల్లో మంగళవారం ఉదయం 7 గంటలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ గడప గడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని జెడ్పీటీసీ గిరిధర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఫయాజ్ అహ్మద్ కోరారు.